సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 30 । జూన్ । 2023

న్యూస్‌రీల్

ప్రసన్న వేంకటేశ్వరుని సన్నిధిలో అన్నకూటోత్సవం



అన్నకూటోత్సవంలో తిరుమల తిరుపతి పర్వతంపై పర్వతాల పేర్లతో పులిహోర నైవేద్యం

అక్కిరెడ్డిపాలెం: బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రసన్న వేంకటేశ్వరాలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని తిరుప్పావడ సేవ (అన్నకూటోత్సవం) నిర్వహించారు. గురువారం వేకువ జామునే ప్రసన్న వేంకటేశ్వరునికి పులిహోరను (సప్తగిరులైన శేషాద్రి, నీలాద్రి గరుడాద్రి, అంజనాద్రి, వృషభాద్రి, నారాయణాద్రి, వేంకటాద్రితో పాటు శ్రీవారి పుష్కరిణి, శ్రీవారి పోటు పేరిట) రాశులుగా నివేదించారు. అనంతరం భక్తులకు పులిహోర ప్రసాదం అందించారు.

ఎన్టీపీసీలో ఎఫ్‌జీడీ సిస్టమ్ ప్రారంభం



సింహాద్రిలో ఎఫ్‌జీడీ సిస్టమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బృంద సభ్యులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎఫ్‌జీడీ (ఫ్లూగ్యాస్ డీసర్ఫ్‌లైజేషన్) సిస్టమ్‌ను సంస్థ జీజీఎం సంజయ్ కుమార్ సిన్హా గురువారం ప్రారంభించారు. సంస్థలో నాలుగో యూనిట్ 300 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తున్న సమయంలో ఈ నూతన ఎఫ్‌జీడీ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సిస్టమ్ వలన ఫ్లూగ్యాస్‌లోని సల్ఫర్‌డయాక్సైడ్ రిమూవ్ చేయడం ద్వారా ఎన్విరాన్‌మెంట్‌కు ప్రయోజనం కలుగుతుందని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓఅండ్ఎం జీఎం డీపీ పాత్ర, ప్రాజెక్టు జీఎం సంతోష్‌కుమార్ ఝా, శ్రీమాధ్యూ (జీఎం), ఆపరేషన్ జీఎం టి.ఆర్.రాజగోపాలన్, జీఎం కె.జగన్‌మోహన్‌రావు, జీఎం ఎస్.పద్మప్రియ, హెచ్‌వో హెచ్‌ఆర్ రూమాడి శర్మ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏజ్‌కేర్ ఫౌండేషన్‌కు కరూర్ వైశ్యాబ్యాంకు సాయం



చెక్కు అందజేస్తున్న ఎండీ రమేష్‌బాబు

ఆరిలోవ: వయోవృద్ధులు, అనారోగ్యంతో అంతిమ దశలో ఉన్న రోగులకు సంరక్షణ కేంద్రమైన స్నేహసంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్‌కు కరూర్ వైశ్యా బ్యాంక్ రూ.1.6 కోట్లు విరాళం ప్రకటించింది. అందులో భాగంగా రెండో విడతగా రూ.50 లక్షల చెక్కును గురువారం ఫౌండేషన్ ప్రతినిధులకు బ్యాంక్ ఎండీ బి. రమేష్ బాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా ఈ ఏడాది మార్చిలో రూ.24 లక్షలు అందించామన్నారు. చివరి విడత రూ.86 లక్షలను వృద్ధులకు అవసరమైన వైద్య పరికరాలకు కేటాయించామన్నారు. భవన నిర్మాణం పూర్తయిన తరువాత మిగిలిన మొత్తాన్ని అందజేస్తామన్నారు.

వీజేఎఫ్ సర్వసభ్య సమావేశం రేపు

మహారాణిపేట: వైజాగ్ జర్నలిస్టు ఫోరం (వీజేఎఫ్) సర్వసభ్య సమావేశం శనివారం ఆంధ్రా విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ హాలులో నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్న సమావేశానికి సభ్యులు హాజరు కావాలని స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు ఐదుగురు సభ్యుల కమిటీ వీజేఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వహించనుంది. ఐదు అంశాలతో అజెండా రూపొందించారు.

రేపు డయల్ యువర్ సీపీ

దొండపర్తి(విశాఖ దక్షిణ): ప్రజల నుంచి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించేందుకు నగర పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ శనివారం డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను ఆ రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య 0891-2523408 నెంబర్‌కు కాల్ చేసి నేరుగా సీపీకి తెలియజేసే అవకాశాన్ని కల్పిస్తున్నారు.

పిల్ల గాలుల పవర్ చూద్దాం..!



- తక్కువ గాలి వేగంతో విద్యుత్ ఉత్పత్తికి ఏయూ ప్రణాళికలు
- మైక్రో విండ్ టర్బైన్ జనరేటర్ అభివృద్ధికి పరిశోధనలు
- స్ట్రీట్, హైవే లైటింగ్‌కు వినియోగించేలా నిర్మాణం
- తుది దశకు చేరుకున్న ఏయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధనలు

సాక్షి, విశాఖపట్నం : పవన విద్యుత్ ఉత్పత్తి చేయాలంటే కనీసం 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయాల్సి ఉంటుంది. అప్పుడే టర్బైన్ల ద్వారా శక్తి ఉత్పత్తి అయి.. విద్యుత్‌గా మారుతుంది. ఈ ట్రెండ్‌ను కాస్తా మార్చాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రయత్నిస్తోంది. తక్కువ గాలి వేగంతోనే విద్యుత్‌ను ఉత్పత్తి చేసే దిశగా పరిశోధనలు నిర్వహిస్తోంది. పిల్ల గాలుల నుంచి పవర్ జనరేట్ చేసి.. ఇళ్లతో పాటు ఇతర అవసరాలకు వినియోగించే దిశగా అడుగులు వేస్తోంది. మైక్రో విండ్ టర్బైన్ జనరేటర్ అభివృద్ధి చేస్తూ.. టర్బైన్లలో ఉండే గేర్‌బాక్స్ స్థానంలో ప్రత్యేక వ్యవస్థను అమర్చేలా ప్రయోగాలు చేస్తోంది.

థర్మల్, హైడ్రల్ విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యామ్నాయంగా సౌర, పవన విద్యుత్‌పై యావత్ ప్రపంచం దృష్టిసారించింది. ఇప్పటికే పునరుత్పాదక ఇంధనంగా సౌర విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. మరోవైపు పవన విద్యుత్ ఉత్పత్తి పెంపుపైనా ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమిస్తున్నాయి. ఈ తరుణంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కూడా అదే రీతిలో ఆలోచనలు చేస్తోంది. పవన విద్యుత్‌లోనూ తక్కువ గాలుల వేగంతో విండ్ పవర్ జనరేట్ చేసేలా పరిశోధనలు విస్తృతం చేసింది. ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సూచనల మేరకు ఏయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ పరిశోధనలు రెండేళ్ల క్రితం మొదలు పెట్టారు. ఇప్పుడు చివరి దశకు చేరుకున్నాయి.

వీధి దీపం నుంచి.. వ్యవసాయ పంపు సెట్ వరకూ..

ఏయూ అభివృద్ధి చేయనున్న ఎండబ్ల్యూటీజీ ద్వారా అనేక లాభాలున్నాయి. ఈ మైక్రో టర్బైన్‌ను ఉపయోగించి, వీధి దీపాలను వెలిగించవచ్చు. అదే విధంగా జాతీయ రహదారులపై లైట్స్, ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు వ్యవసాయ పంప్‌సెట్స్ కూడా నడిపించవచ్చు. భారీ విండ్ టర్బైన్లకు ఉండే గేర్‌బాక్స్‌లు ఈ ఎండబ్ల్యూటీజీకి ఉండవు కాబట్టి.. ఎక్కడైనా సులువుగా అమర్చేందుకు వీలు పడుతుంది.



ముఖ్యంగా తీర ప్రాంతాలైన విశాఖపట్నం, మంగళూరు, చెన్నై, గోవా, ముంబై, కొచ్చి వంటి తీర ప్రాంత పట్టణాల్లో ఈ తరహా మైక్రో విండ్ టర్బైన్లు అత్యంత అద్భుతంగా పనిచేస్తాయని ఏయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ పి.మల్లికార్జున రావు తెలిపారు. గేర్ బాక్స్‌కు బదులుగా.. విండ్‌టర్బైన్ ఎమ్యులేటర్ సిస్టమ్‌ని సిద్ధం చేస్తున్న ఎండబ్ల్యూటీజీ పరిశోధనలు మరికొన్ని ఇంకా మిగిలి ఉన్నాయని వివరించారు. ఈ విద్యుత్ స్టోరేజీకి బ్యాటరీ అవసరం ఉండదని, యూపీఎస్‌కు లేదా డొమెస్టిక్ ఇన్వర్టర్‌కు అనుసంధానించినా సరిపోతుందని స్పష్టం చేశారు. త్వరలోనే మిగిలిన పరిశోధనలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని మల్లికార్జునరావు వెల్లడించారు.

ఐదారు కిలోమీటర్ల వేగంతోనే...

విండ్ పవర్ ఉత్పత్తి అవ్వడానికి కనీసం 8 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులైనా ఉండాలి. కానీ ఏయూ మాత్రం పిల్ల గాలులతోనైనా విద్యుత్ ఉత్పత్తి చేయాలనే ఉద్దేశంతో పరిశోధనలు చేస్తోంది. ఇందులో భాగంగా 5 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచే గాలితో విద్యుత్ ఉత్పత్తి చేయగల మైక్రో విండ్ టర్బైన్ జనరేటర్ (ఎండబ్ల్యూటీజీ) రూపొందించే ప్రయోగాలు తుది దశకు చేరుకుంటున్నాయి. సాధారణంగా రోజులో కేవలం 30 శాతం మాత్రమే సూర్యరశ్మి కనిపిస్తుంటుంది. కానీ తీరప్రాంతాల్లో నిరంతరం గాలులు వీస్తుంటాయి. ప్రతి సంవత్సరం 2.5 శాతం మాత్రమే సౌర శక్తి నుంచి విద్యుత్‌ని ఉత్పత్తి చేయగలుగుతున్నాం. కానీ దీనికి రెట్టింపుగా విండ్ పవర్‌ను ఉత్పత్తి చేయగలమనే ఉద్దేశంతో ఈ ప్రయోగాలను ఆంధ్ర విశ్వవిద్యాలయం విస్తృతం చేసింది.



ఇమ్యులేటర్ నమూనా

త్యాగానికి ప్రతీక బక్రీద్



జిల్లా వ్యాప్తంగా బక్రీద్ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగాలద్వారా ప్రాప్తించిన ప్రయోజనాలు సమానంగా అందినప్పుడే.. ఆ త్యాగాలకు సార్థకత చేకూరుతుందన్న సందేశాన్ని.. బక్రీద్ విశ్వమానవాళికి అందిస్తుందని ముస్లింలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.



వన్‌టౌన్ ప్రాంతంలో బక్రీద్ సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నేటి నుంచి గంగవరం పోర్టు కార్మికుల విధుల బహిష్కరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



సమావేశానికి హాజరైన కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచే వరకూ, విధుల నుంచి తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకునే వరకూ పోరాటాలు చేస్తామని గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. గురువారం రాత్రి నుంచి కార్మికులు విధులు బహిష్కరిస్తున్నామని చెప్పారు. తమకు న్యాయం చేయకపోతే పోర్టుకు తాళాలు వేస్తామన్నారు. యాజమాన్యం దిగొచ్చే వరకూ 14 రోజుల పాటు విధులకు వెళ్లే ప్రసక్తే లేదన్నారు. దిబ్బపాలెం పెద్దమ్మోరు ఆలయం వద్ద గురువారం రాత్రి అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మూడు రోజుల పాటు కార్మికులకు యాజమాన్యం సెలవులు ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే గురువారం ఉదయం నుంచి విధులకు రావాలని కోరడంతో కేవలం 29 మంది కార్మికులు హాజరయ్యారన్నారు. అయితే వారందరిని కార్యాలయానికి పిలిచించి భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. ఉద్యమాల్లో పాల్గొంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించారన్నారు. వారికి నోటీసులు ఇచ్చారని తెలిపారు. యాజమాన్యం అవలంబిస్తున్న తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఉపాధి కల్పిస్తామని, జీవన భృతి ఇస్తామని చెప్పి భూములు తీసుకుని ఇప్పుడు కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వెంటనే యాజమాన్యం కార్మికులతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. పోర్టు కార్మికులకు న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తున్నానని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఈ సమస్యపై పార్టీ పెద్దలతో చర్చించామన్నారు. అంతేకాకుండా పోర్టు యాజమాన్య ప్రతినిధులు, కలెక్టర్‌తో కూడా చర్చలు జరిపామన్నారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీతాలు పెంచకుండా కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని అణిచివేసేందుకు పోర్టు యాజమాన్యం ప్రయత్నించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్ దల్లి గోవింద్, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, సీపీఐ నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ, కొవిరి అప్పలరాజు, జెర్రిపోతుల ముత్యాలు, కార్మిక సంఘ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఇంటర్ తప్పడంతో పరార్

- ముగ్గురు విద్యార్థులు సేఫ్
- హైదరాబాద్ నుంచి విశాఖ తీసుకొచ్చిన పోలీసులు
- తల్లిదండ్రులకు అప్పగింత
- వివరాలు వెల్లడించిన సీపీ త్రివిక్రమ్ వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి (విశాఖ దక్షిణ): ముగ్గురు విద్యార్థులు ఇంటర్‌లో కొన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయ్యారు. తల్లిదండ్రులు మందలిస్తారని భావించారు. ఇంటి నుంచి వెళ్లిపోయి పానీ పూరీ షాపు లేదా ఏదైనా వ్యాపార సముదాయంలో గానీ పనిచేద్దామని పరారయ్యారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మూడు బృందాలతో దర్యాప్తు చేపట్టగా వారు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థులను అక్కడి నుంచి సురక్షితంగా తీసుకువచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ తెలిపారు. గురువారం పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. గాజువాకకు చెందిన దిలీప్ (16), జి.ఉమేష్ పవన్(16), ఉపాడ బాబి (16) పాత గాజువాక ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరు కొన్ని సబ్జెక్ట్స్‌లో ఫెయిల్ అయ్యారు. తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో ఇంటి నుంచి దూరంగా వెళ్లిపోయి ఏదైనా పనిచేసుకోవాలని భావించారు. దీంతో ఈ నెల 25న కాలేజీకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పిన వీరు ముందు కె.కోటపాడులో ఉన్న దిలీప్ ఇంటికి వెళ్లారు. కొంత సేపటి తరువాత అక్కడి నుంచి విశాఖ రైల్వే స్టేషన్‌కు వచ్చి తిరువనంతపురం రైలు ఎక్కారు.

మూడు బృందాలతో గాలింపు

తమ పిల్లలు ఇంటికి రాకపోవడంతో వారి తల్లిదండ్రులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు మూడు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. విద్యార్థుల వద్ద ఫోన్ లేకపోవడంతో వారిని ట్రేస్ చేయడం కష్టంగా మారింది. ఇదిలా ఉంటే విద్యార్థులు తిరువనంతపురం నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. వారు తీసుకువెళ్లిన డబ్బులు అయిపోవడంతో తమ కోసం తల్లిదండ్రులు ఏం అనుకుంటున్నారో తెలుసుకోవాలని భావించి అక్కడున్న ఓ వ్యక్తి ఫోన్ తీసుకొన్న విద్యార్థి అతని సోదరుడికి ఫోన్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ నంబర్ సిగ్నల్స్ ఆధారంగా వారు సికింద్రాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఫోన్‌గల వ్యక్తితోపాటు విద్యార్థుల్లో ఒకరి మేనమామ కూడా సికింద్రాబాద్‌లోనే ఉన్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. దీంతో వీరిద్దరికి విషయం చెప్పి...విద్యార్థులను సమీపం జీఆర్‌పీ పోలీసులకు సమాచారమందించాలని ఇక్కడ పోలీసులు సూచించారు. ఈ మేరకు విద్యార్థులను జీఆర్‌పీ పోలీసులు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గాజువాక పోలీసులు సికింద్రాబాద్‌కు వెళ్లి విద్యార్థులను తీసుకువచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇందులో ఎవరి కుట్రకోణం లేదని సీపీ త్రివిక్రమ్ వర్మ తెలిపారు. కేసును ఛేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు.

గంగవరం పోర్టు వివాదంపై చర్చలు

గంగవరం పోర్టులో పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని సీపీ తెలిపారు. అది కేవలం యాజమాన్యం, కార్మికుల మధ్య ఉద్యోగ, వేతన ఒప్పందం విషయంలో కొంత వివాదం నెలకొందని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగేలా చర్యలు తీసుకొన్నామన్నారు. అందులో తీసుకున్న నిర్ణయాలపై కొంత మంది అంగీకారం తెలిపితే.. కొంత మంది వ్యతిరేకించినట్లు చెప్పారు. ఈ వ్యవహారం జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందన్నారు. పోర్టు కార్యకలాపాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

మూడేళ్లలో నలుగురికే గన్ లైసెన్సులు

గన్ లైసెన్సుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటున్నారన్న వార్తల్లో ఎటువంటి వాస్తవం లేదని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ తేల్చి చెప్పారు. 2020 నుంచి ఇప్పటి వరకు కేవలం 15 మంది మాత్రమే లైసెన్సుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఇందులో కేవలం నలుగురికి మాత్రమే గతంలోనే లైసెన్సులు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కూడా 2020లోనే లైసెన్సు కోసం దరఖాస్తు చేశారని, అయితే ఇప్పటి వరకు మంజూరు చేయలేదన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో కూడా సీఆర్‌పీఎఫ్ అధికారులు ముగ్గురు, మాజీ సైనికుడు ఒకరు, స్పోర్ట్స్ కోటాలో ఇద్దరు, సెల్ఫ్ డిఫెన్స్ కింద నలుగురు దరఖాస్తులు చేసుకున్నట్లు వెల్లడించారు. తాజాగా ఇద్దరు మాత్రమే లైసెన్సుల కోసం అప్లై చేశారని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తంగా 620 గన్‌లైసెన్సులు మంజూరు చేసినట్లు చెప్పారు.

అవకతవకలపై విచారణ

చోడవరం : హుద్‌హుద్ తుపాను సమయంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి జరిగిన నష్టంలో అవకతవకలపై 51బి విచారణ జరిపినట్లు రాష్ట్ర సుగర్ కేన్ కమిషనర్ వెంకట్రావు చెప్పారు. గత మహాజనసభలో సభ్యుల తీర్మానంమేరకు హుద్‌హుద్ తుపాను నష్టంలో అవకతవకలు, మొలాసిస్ అమ్మకాల్లో వచ్చిన ఆరోపణలపై అంతర్గత విచారణ జరిపినట్లు కమిషనర్ చెప్పారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో టాప్ ర్యాంక్ లక్ష్యం

SWACHH SURVEKSHAN 2023

- అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పారిశుధ్య కార్మికుల నియామకం
- గిరి ప్రదక్షిణలో సింగిల్ ప్లాస్టిక్ వినియోగం నిషిద్ధం
- 'ఎకో వైజాగ్' అంశంపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు
- విజేతల చిత్రాలు ప్రధాన కూడళ్లలో ప్రదర్శన
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ వెల్లడి



అల్లిపురం: స్వచ్ఛ సర్వేక్షణ్-2023కు సంబంధించి శనివారం నుంచి సిటిజన్ ఫీడ్ బ్యాక్ ప్రారంభమవుతుందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. నగర ప్రజలు ఇందులో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖను జాతీయ స్థాయిలో అత్యున్నత నగరంగా నిలిపేందుకు సహకరించాలని కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో టాప్ ర్యాంక్ లక్ష్యంగా వార్డుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే డిజిటల్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. క్లాప్ వాహనాలు, ఎఫ్ఎం రేడియోల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పారిశుధ్య కార్మికులను నియమిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు.

పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మరణించిన వారిపై, 60 ఏళ్లు పైబడిన కారణంగా విధుల నుంచి తొలగించబడిన కార్మికులపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ప్రాధాన్యం కల్పిస్తూ 482 ఖాళీల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. మొదటి విడతలో 119 మంది అభ్యర్థులను ఎంపిక చేసి.. ఆప్కోస్‌లో వివరాలు నమోదు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జీవీఎంసీ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. రెండో విడతలో భాగంగా జూలై 1 నుంచి 8వ తేదీ వరకు కారుణ్య నియామకాల నియమావళిలో పేర్కొన్న సంబంధీకులతో పాటు కోడలు, అల్లుడు, మనవడు, మనమరాలు, మేనల్లుడు తదితరుల పత్రాల పరిశీలించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు.

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ల నిర్వహణ: జీవీఎంసీ పరిధిలోని 98 వార్డుల్లో వ్యర్థాల నిర్వహణకు రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్(ఆర్‌ఆర్‌ఆర్) పద్ధతిని అమలు చేస్తున్నట్లు కమిషనర్ వివరించారు. 8 జోనల్ కార్యాలయాల పరిధిలో శాశ్వత ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా వ్యర్థాల పునర్వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

పటిష్టంగా ప్లాస్టిక్ నిషేధం

ఇకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా ఇకో జీరో ప్లాస్టిక్ అంశానికి ప్రాధాన్యమిస్తూ నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్లాస్టిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేసి జూన్ 5వ తేదీ నుంచి ఇప్పటి వరకు 1,379 వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో తనిఖీలు చేపట్టాయని వివరించారు. 2,864 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను సీజ్ చేసి, రూ.12,45,300 జరిమానా వసూలు చేసినట్లు వెల్లడించారు.

గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ నిషేధం

వరాహ లక్ష్మీనృసింహ స్వామి గిరి ప్రదక్షిణ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలకు ఈ విషయంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. 100 వరకు వాటర్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. స్వచ్ఛంద సంస్థలు వాటర్ ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేయొద్దని సూచించారు. కాగితం, ఆకుల్లో ప్రసాదం అందజేయాలన్నారు.

ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు ఉపయోగిస్తే జీవీఎంసీ బృందాలు స్వాధీనం చేసుకుంటాయని స్పష్టం చేశారు. గిరి ప్రదక్షిణలో నాలుగు రంగుల జెండాల విధానాన్ని పాటిస్తున్నామని వెల్లడించారు. నీరు అందించే టెంట్ల వద్ద నీలం రంగు జెండా, మరుగుదొడ్ల వద్ద తెల్లని జెండా, డస్ట్‌బిన్ల వద్ద ఆకుపచ్చ జెండా, వైద్య శిబిరాల వద్ద ఎర్రటి జెండాలను 10 మీటర్ల ఎత్తులో ఏర్పాటు చేస్తామన్నారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే పిల్లలకు తల్లిదండ్రుల పేర్లు, ఫోన్ నంబర్‌తో ట్యాగ్ వేస్తామన్నారు.

వర్షాకాలం దృష్ట్యా ముందస్తు చర్యలు

వర్షాకాలం దృష్ట్యా అన్ని కాలువల్లో పూడికలు తొలగించినట్లు కమిషనర్ తెలిపారు. మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలకుండా ఫ్రైడే-డ్రైడే అవగాహన కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేస్తామన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు జూలై 7న 'ఎకో వైజాగ్' కాన్సెప్ట్ పై చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థుల చిత్రాలను నగరంలో ప్రధాన కూడళ్లలో ప్రదర్శిస్తామని వెల్లడించారు. కాలుష్య నియంత్రణ వ్యర్థాల సేకరణ కోసం జూలై 1 నుంచి 65 ఎలక్ట్రానిక్ ఆటోలను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. వీటితో పాటు 10 పాసింజర్ ఎలక్ట్రానిక్ ఆటోల్లో ప్రజలకు ఉచిత రవాణా అవకాశం కల్పిస్తామన్నారు. వర్టికల్ గార్డెన్లు, ప్లాస్టిక్, వివిధ రకాల వ్యర్థాలతో తీర్చిదిద్దన కళా రూపాలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తామన్నారు.

కెమెరా కన్నులో జ్ఞాపకాలు పదిలం



ప్రదర్శనలో పురాతన కెమెరాలు

ఆరిలోవ: గడిపిన క్షణాలను, సంఘటనలను మధుర జ్ఞాపకాలుగా మన ముందుంచేవి ఫొటోలని, కెమెరా బంధించిన మన జ్ఞాపకాలు మధురానుభూతిని కలిగిస్తాయని సీషోర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె.ఎస్.సాయిప్రసాద్ అన్నారు. జాతీయ కెమెరా దినోత్సవం సందర్భంగా గురువారం వాల్తేరు ఫొటోగ్రఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో వీఎంఆర్డీఏ పార్కులో పురాతన కెమెరాల ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనను ప్రారంభించిన ప్రసాద్ మాట్లాడుతూ 1940 నుంచి అత్యాధునిక కెమెరాల ప్రదర్శన అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పురాతన కెమెరాలను సేకరించిన కృష్ణంరాజును ఘనంగా సత్కరించారు. వాల్తేరు ఫొటోగ్రఫీక్ సొసైటీ అధ్యక్షుడు పి.ఎస్.సేతు, కార్యదర్శి ఎం.వి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాగస్వాములే కిడ్నాపర్లు

- భార్యాభర్తల కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు
- విజయవాడలో భర్త శ్రీనివాస్ రియల్ ఎస్టేట్ సంస్థ ఏర్పాటు
- భాగస్వాములుగా మరో నలుగురు ఆ సంస్థలో పెట్టుబడులు
- కోవిడ్ సమయంలో ఇచ్చిన అడ్వాన్స్‌లు తిరిగి రాక నష్టాలు
- బాధితుల ఫిర్యాదుతో జైలుకెళ్లిన శ్రీనివాస్
- డబ్బులు ఇవ్వకపోవడంతో భాగస్వాములే కిడ్నాప్‌కు ప్రయత్నం
- గంటల్లోనే వారిని పట్టుకున్న విశాఖ పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, చిత్రంలో డీసీపీలు విద్యాసాగర్ నాయుడు, ఆనంద్‌రెడ్డి

దొండపర్తి: విజయవాడకు చెందిన భార్యాభర్తల కిడ్నాప్ కేసును విశాఖ పోలీసులు ఛేదించారు. వ్యాపార భాగస్వాములే వారిని కిడ్నాప్ చేసి రెండు కార్లలో విశాఖ నుంచి విజయవాడకు తీసుకువెళుతుండగా మార్గమధ్యలోనే పోలీసులు వారిని పట్టుకున్నారు. బాధితులు పట్నాల శ్రీనివాసరావు, లోవలక్ష్మి ఇద్దరినీ సురక్షితంగా విడిపించారు. విజయవాడకు చెందిన నలుగురు కిడ్నాపర్లు గ్రంధి బ్రహ్మయ్య, కొమవరపు సాయి నిఖిల్, బండారి వీరమణికంఠ, సింగంరెడ్డి ప్రదీప్‌రెడ్డిలను అరెస్ట్ చేయగా.. మరో వ్యక్తి సన్నీ పరారీలో ఉన్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ తెలిపారు. పోలీస్ సమావేశంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధితులు, కిడ్నాపర్లు అందరూ విజయవాడకు చెందిన వారేనని, ఇందులో విశాఖతో ఏ సంబంధం లేదని స్పష్టం చేశారు. వ్యాపారంలో ఆర్థికలావాదేవీల కారణంగానే సహచర భాగస్వాములే కిడ్నాప్‌కు ప్రయత్నించారని వెల్లడించారు. శ్రీనివాసరావుపై 2012 నుంచి ఇప్పటి వరకు వివిధ పోలీస్ స్టేషన్లలో నాలుగు చీటింగ్ కేసులు ఉన్నట్లు చెప్పారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ తెలిపిన వివరాలివీ..

విజయవాడకు చెందిన పట్నాల శ్రీనివాసరావు మరో నలుగురు మనోజ్‌కుమార్, రవితేజ, వాగ్దేవి, నవీన్‌లతో కలిసి 2019లో ఎంకే కన్‌స్ట్రక్షన్స్ పేరుతో ఓ రియల్ ఎస్టేట్ బ్రోకరైజ్ సంస్థను ప్రారంభించారు. శ్రీనివాసరావుకు మార్కెటింగ్‌లో మంచి అనుభవం ఉందని భావించిన ఈ నలుగురు రూ.15 లక్షలు చొప్పున పెట్టుబడులు పెట్టారు. వీరు భూములు కొనేవారికి, అమ్మేవారికి మధ్య వర్తిత్వం చేసి కమిషన్ తీసుకునేవారు. అలాగే కొంత మంది భూమి అమ్మకందారులు, రియల్ ఎస్టేట్ సంస్థలతో తక్కువ ధరకు భూములు మాట్లాడుకొని కొద్ది మొత్తంలో వారికి అడ్వాన్సులు చెల్లించి అనంతరం వాటిని ఎక్కువ ధరకు విక్రయించి లాభాన్ని ఆర్జించేవారు.

రూ.3.36కోట్లు తీసుకొని చెల్లించనందుకు చీటింగ్ కేసు

ఇలా 39 మంది కొనుగోలుదారుల నుంచి అడ్వాన్సుల రూపంలో వీరు రూ.3.36కోట్లు వసూలు చేశారు. అయితే కోవిడ్ కారణంగా భూముల యజమానులు, రియల్ ఎస్టేట్ సంస్థలకు ఇచ్చిన అడ్వాన్సులు తిరిగి రాలేదు. అలాగే భూముల లావాదేవీలు జరగకపోవడంతో ఎంకే కన్‌స్ట్రక్షన్స్ సంస్థ కార్యకలాపాలు కూడా నిలిచిపోయాయి. దీంతో తీసుకున్న డబ్బును చెల్లించాలని కొనుగోలుదారులు ఒత్తిడి చేశారు. అప్పటికీ ఇవ్వకపోవడంతో వారు విజయవాడ పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో శ్రీనివాసరావుతో పాటు నలుగురిని అరెస్ట్ చేశారు. శ్రీనివాసరావు 11 నెలల పాటు రిమాండ్‌లో ఉన్నాడు. అనంతరం బెయిల్‌పై విడుదలైన అతను తూర్పుగోదావరి జిల్లా రావులపాలేనికి మకాం మార్చాడు. అక్కడ సత్యసాధ అనే స్వచ్ఛంద సంస్థలో వలంటీర్‌గా చేరాడు. అందులో వీర మణికంఠ అనే వ్యక్తి నుంచి రూ.20లక్షలు తీసుకొని డబ్బు చెల్లించకుండా మోసం చేశాడు. అక్కడి నుంచి భార్య లోవలక్ష్మితో కలిసి రెండు నెలల కిందట విశాఖపట్నం వచ్చేశాడు.

విజయవాడ నుంచి రెండు కార్లలో వచ్చి కిడ్నాప్

విశాఖకు వచ్చిన శ్రీనివాసరావు దంపతులు గురుద్వార ప్రాంతంలో ఉన్న స్నేహితుడి ఇంట్లో నివాసముంటున్నారు. అక్కయ్యపాలెం ప్రాంతంలో ఒక రియల్‌ఎస్టేట్ సంస్థలో ఎగ్జిక్యూటివ్‌గా శ్రీనివాసరావు, టెలీకాలర్‌గా లోవలక్ష్మి చేరారు. వీరి భాగస్వాములు డబ్బులు కోసం శ్రీనివాసరావుకు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో వారు విజయవాడ నుంచి విశాఖకు వచ్చారు. భార్యాభర్తలిద్దరినీ బుధవారం సాయంత్రం అక్కయ్యపాలెంలో బలవంతంగా కారు ఎక్కించి విజయవాడకు తీసుకువెళ్లేందుకు బయలుదేరారు. మార్గమధ్యలో శ్రీనివాస్ బహిర్భూమికి వెళతానని చెప్పడంతో వారు యలమంచిలి జాతీయ రహదారిపై కారు నిలిపారు. ఈ సమయంలో భార్య లోవలక్ష్మి బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు గమనించారు. దీంతో కిడ్నాపర్లు లోవలక్ష్మిని కారు నుంచి దింపేసి శ్రీనివాసరావును ఎక్కించుకుని వెళ్లిపోయారు. స్థానికుల సహాయంతో లోవలక్ష్మి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. దీంతో అక్కడ పోలీసులు అప్రమత్తమై విశాఖ నాలుగో పట్టణ పోలీసులను కూడా సమాచారం అందించారు.

శ్రీనివాసరావుపై నాలుగు చీటింగ్ కేసులు

పోలీసుల విచారణలో శ్రీనివాసరావుపై విజయవాడలో నమోదైన కేసుతో పాటు మరో మూడు చీటింగ్ కేసులు ఉన్నట్లు సీపీ వెల్లడించారు. 2012లో నర్సీపట్నంలో గృహోపకరణాలు తక్కువ ధరకు ఇస్తానని చెప్పి డిపాజిట్లు సేకరించి ఇవ్వకపోవడంతో కేసు నమోదైందన్నారు. ఆ కేసు ప్రస్తుతం పెండింగ్‌లో ఉందన్నారు. అలాగే ఓ అమ్మాయిని మోసం చేసి పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నించగా కృష్ణా జిల్లా కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో, చెల్లని చెక్కులు ఇచ్చి రూ.20 లక్షలు తీసుకున్నందుకు రాజానగరం పోలీస్‌స్టేషన్‌లోను కేసులు నమోదైనట్లు వివరించారు. బాధితులు గ్రంధి బ్రహ్మయ్య, సాయి నిఖిల్, బండారు వీరమణికంఠ, వారి అనుచరులు మొత్తంగా ఐదుగురు కలిసి కిడ్నాప్‌కు ప్రయత్నించినట్లు చెప్పారు. సమావేశంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, ఆనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరొకరి కోసం గాలింపు

విషయం తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమై మిగిలిన స్టేషన్లకు సమాచారం అందించారు. దీంతో కిడ్నాపర్ల కారుపై నిఘా పెట్టిన పోలీసులు కత్తిపూడి వద్ద గుర్తించి పట్టుకున్నారు. కిడ్నాపర్ల చెర నుంచి శ్రీనివాసరావును సురక్షితంగా విడిపించారు. నలుగురు కిడ్నాపర్లు విజయవాడకు చెందిన గ్రంధి బ్రహ్మయ్య, గన్నవరానికి చెందిన కొమవరపు సాయి నిఖిల్, కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన బండారి వీర మణికంఠ, విజయవాడకు చెందిన సింగంరెడ్డి ప్రదీప్‌రెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో కిడ్నాపర్ సన్నీ కోసం గాలిస్తున్నట్లు సీపీ త్రివిక్రమ్ వర్మ తెలిపారు.

గిరి ప్రదక్షిణకు పటిష్ట బందోబస్తు

దొండపర్తి : గిరి ప్రదక్షిణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ త్రివిక్రమ్ వర్మ తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రధానంగా కొండపైన, కిందన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కొండపైన బస్‌స్టేషన్‌కు బఫర్ జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ప్రయాణికులతో పాటు బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఉండవన్నారు. అలాగే గిరిప్రదక్షిణ చేసే భక్తులు కొబ్బరికాయలు కట్టేందుకు అందరూ తొలి పావంచా వద్దకు రావడంతో రద్దీ ఏర్పడుతోందని, దీంతో కొత్త ఘాట్ రోడ్డులో కూడా తొలిపావంచా వద్ద ఉన్నట్లే కొబ్బరికాయ కట్టేందుకే కాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఫలితంగా హనుమంతవాక, శొంఠ్యాం నుంచి వచ్చే భక్తులు కొత్త ఘాట్ రోడ్డు వద్దే కొబ్బరికాయ కొట్టి ప్రదక్షిణ ప్రారంభించడంతో కొంత రద్దీ తగ్గుతుందన్నారు. అలాగే ప్రదక్షిణ మధ్యలో అప్పుఘర్ వద్ద భక్తులు స్నానాలు చేసే అవకాశం ఉన్నందున అక్కడ ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా స్విమ్మర్లతో పాటు డ్రోన్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగానికి ప్రతి అరకిలోమీటర్‌కు ఒక పోలీస్ వాహనం అందుబాటులో ఉంటుందన్నారు. సమావేశంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ-2 ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ యువతులపై చేయిచేసుకున్న కేసులో ఒకరికి రిమాండ్

ఆరిలోవ: ఆదర్శనగర్‌లోని లాడ్జిలో థాయిలాండ్ యువతులపై చేయిచేసుకున్న వ్యక్తిని ఆరిలోవ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 8న లాడ్జిలో ఉన్న థాయిలాండ్‌కు చెందిన ఇద్దరు యువతులు, విశాఖకు చెందిన మరో యువతిపై సురవరపు మహేష్ చేయిచేసుకున్నాడు. దీంతో వారు సీపీకి ఫిర్యాదు చేయడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ లాడ్జిపై దాడి చేశారు. అక్కడి నుంచి పరారైన మహేష్‌ను రెండు రోజుల తర్వాత శ్రీకాకుళం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే ఆత్మహత్యాయత్నాకి పాల్పడిన మహేష్‌ను అక్కడ పోలీసులు ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. అతని ఆరోగ్యం కుదుటపడటంతో బుధవారం శ్రీకాకుళం నుంచి విశాఖ తీసుకొచ్చి గురువారం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు. కోర్టు రిమాండ్ విధించడంతో అతన్ని విశాఖ కేంద్ర కారాగారానికి తరలించామన్నారు. నిందితుడి స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలోని యశోద నగర్. అతనిపై గతంలో పలు కేసులు నమోదైనట్లు సీఐ వెల్లడించారు.

వ్యక్తిపై బీరు బాటిళ్లతో దాడి

- ప్రేమ వ్యవహారమే కారణం?
- యువతి అన్నయ్యే దాడి చేయించినట్లు పోలీసుల అంచనా

అక్కిరెడ్డిపాలెం: గాజువాక మార్కెట్‌లో ఓ వ్యక్తిపై కొందరు బీరు బాటిళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలివీ.. కణితి రోడ్డుకు చెందిన కాండ్రెగుల శ్రీనివాస్ సొంతంగా పూజా సామగ్రి షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా శ్రీనివాస్‌పై బీరు బాటిళ్లతో దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాగా.. ప్రేమ వ్యవహారమే ఈ దాడికి కారణమని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సీఐ తెలిపారు. శ్రీనివాస్, ఓ యువతి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందని, వీరి ప్రేమను ఆమె అన్నయ్య వ్యతిరేకిస్తున్నాడని చెప్పారు. ఆమెతో చాటింగ్‌లు చేయడం వంటి వ్యవహారాలు నచ్చకపోవడంతో శ్రీనివాస్‌పై వినయ్ అనే రౌడీ షీటర్‌తో దాడి చేసినట్లు సమాచారం. పరారీలో ఉన్న రౌడీషీటర్ వినయ్ పట్టుకుని విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని సీఐ వెల్లడించారు.



సంప్రదాయ వేషధారణలో చిన్నారులు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



విదేశీ ముస్లింల సందడి

త్యాగానికి ప్రతీక బక్రీద్

దాబాగార్డెన్స్: త్యాగ నిరతికి, భక్తి భావానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాతజైల్ రోడ్డు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఎదురుగా గల సర్వీస్ రోడ్డులో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వేడుకలు జరిగాయి. ఉదయం 8 నుంచే ముస్లింలు పెద్ద సంఖ్యలో ఈద్గాలో ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. సంప్రదాయ వస్త్రధారణలో యువత సందడి చేసింది. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదర్ ఆలీ షింకా మాట్లాడుతూ సమానత్వం, ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వం ఆకాంక్షిస్తూ ప్రార్థనలు చేశామన్నారు. నగరంలో 3 లక్షల మంది ముస్లింలు ఉన్న నేపథ్యంలో ప్రతి 20 వేల మంది జనాభాకు ఒక మసీదు ఉండేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సొసైటీ ఉపాధ్యక్షుడు హాజీమీర్ అబ్బాస్ హుస్సేన్, కార్యదర్శి అమీర్‌జాన్, నిర్వాహక కార్యదర్శి ఎండీ రహ్మతుల్లా, కోశాధికారి ఎస్.కె.అహ్మద్‌మల్లీ, మోహబూబ్ ఆలీఖాన్, అజ్‌గర్ ఆలీ, మహబూబ్ షరీఫ్, మహ్మద్ అస్లం, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

బులుసు 'జీవన వాహిని' రచనకు పురస్కారం



వెంకటేశ్వర్లు

తగరపువలస : ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి సంస్మరణార్థం ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఇటీవల నిర్వహించిన పద్యకావ్యాల పోటీల్లో వెంకటేశ్వర్లు రచించిన 'జీవన వాహిని'కి ప్రథమ బహుమతి లభించింది. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీలో ఆయనకు పురస్కారంతో పాటు రూ.లక్ష అందించనున్నట్టు తానా అధ్యక్ష కార్యదర్శులు లావు అంజయ్య చౌదరి, తోటకూర ప్రసాద్ ప్రకటించారు. దేశవిదేశాల నుంచి 91 మంది రచయితలు ఈ పోటీలో పాల్గొన్నారు. రచయితల నుంచి వచ్చిన 91 కావ్యాల్లో 50 కావ్యాలను తానా ఈ-బుక్‌లో ప్రచురించనున్నారు. తెలుగు పద్యకవిగా బులుసు ఇప్పటికే ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. తెలుగు వైభవంపై ఎన్నో అనేక సభలలో కావ్యగానాలు చేశారు. 20కు పైగా కావ్యాలు ప్రచురించారు. ఈయన రచించిన నీలమోహనం, మువ్వ, పద్యం రాయడమెలా రచనలు పలువురి మన్ననలు అందుకున్నాయి. ఈ సందర్భంగా బులుసు మాట్లాడుతూ తెలుగు అజరామరమైనదని.. అది మన తెలుగు వారికే ప్రత్యేకమైన ప్రక్రియ అని అన్నారు.

అప్పన్న సన్నిధిలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ నరసింగరావు అందజేశారు.



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ దంపతులు

రూ.4.62 కోట్లతో బస్ షెల్టర్ల ఆధునికీకరణ

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



జగదాంబ జంక్షన్ వద్ద బస్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

అల్లిపురం: నగరంలో ఆధునికీకరిస్తున్న బస్ షెల్టర్లను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ గురువారం పరిశీలించారు. 3,4 జోన్ల పరిధిలో దత్ ఐలాండ్, ద్రోణంరాజు సర్కిల్, జగదాంబ జంక్షన్, బీచ్‌రోడ్‌లోని స్విమ్మింగ్ పూల్, వాల్తేరులోని లాసన్స్ బే పార్క్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సుమారు రూ.4.62 కోట్లతో జీవీఎంసీ పరిధిలో 20 బస్ షెల్టర్లను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. దత్‌ఐలాండ్, ద్రోణంరాజు సర్కిల్‌లు ఆధునికీకరించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఆక్వా స్పోర్ట్స్ స్విమ్మింగ్ పూల్ పనులు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. డీడీహెచ్ దామోదర్‌రావు, పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్‌కుమార్, వేణుగోపాల్, రాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు దిలీప్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశేషంగా శ్రీనృసింహ హోమం



ప్రధాన కలశను శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు

సింహాచలం: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గురువారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీ నృసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తొలి ఏకాదశితో పాటు స్వాతి నక్షత్రం కలసి రావడంతో దాదాపు 55 మంది ఉభయదాతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని యజ్ఞశాలలో నృసింహ హోమాన్ని విశేషంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ఉన్న హోమగుండం వద్ద అధిష్ఠింపజేశారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారణ చేసి ఆశీర్వదింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమాన్ని ఘనంగా చేపట్టారు. ఉభయదాతలందరి చేత స్వామి అష్టోత్తరనామావళిని పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ కార్యక్రమం చేపట్టారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశను ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామి మూలవిరాట్‌కి సమర్పించారు. అనంతరం ఆ జలాలను భక్తులపై చల్లారు. ఉభయదాతలకు దేవస్థానం తరఫున శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు. ఆలయ సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శేషపాన్పుపై జగన్నాథుడు

నేడు తిరుగు రథయాత్ర



దాబాగార్డెన్స్: జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం స్వామి శేష పాన్పుపై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామిని మేల్కొలిపారు. ప్రార్థనా తరంగిణి, సామూహిక లలితా సహస్రనామ పారాయణ జరిగాయి. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. చివరి రోజు కావడంతో స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. నగరం, జిల్లా నలుమూలల నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో గుండిచా మందిరం ప్రాంగణమంతా కిక్కిరిసింది. గుండిచా మందిరంలో 10 రోజులు కొలువైన జగన్నాథుడు శుక్రవారం తిరుగు పయనం కానున్నారు. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ

- ప్రమాదం చూసి భీతిల్లిన ప్రజలు
- సురక్షితంగా బయటపడిన కుటుంబ సభ్యులు



లారీ ఢీకొనడంతో పల్టీలు కొట్టిన కారు

గోపాలపట్నం: జాతీయ రహదారిపై కాకానినగర్ సమీపంలోని పంజాబీ దాబా వద్ద కారును లారీ ఢీకొట్టింది. కారు పల్టీలు కొట్టగా.. అందులో ఉన్న ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. దొండపర్తి ప్రాంతానికి చెందిన దూరి రమణ తల్లి, భార్య, ఇద్దరు పిల్లలతో కారులో తుని సమీపంలోని తలుపులమ్మ లోవ దర్శనానికి బయలుదేరారు. కాకానినగర్ పంజాబీ దాబా వద్దకు రాగానే వెనుకనే వస్తున్న లారీ బలంగా కారును ఢీకొట్టింది. దీంతో కారు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న రమణకు స్వల్ప గాయాలయ్యాయి. మిగతా కుటుంబ సభ్యులంతా సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్టు, కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కారును తొలగించారు. గాయపడిన రమణను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం చూసి భీతిల్లిన ప్రజలు.. ఎవరికీ ఏం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. లారీ డ్రైవర్‌ను ఎయిర్‌పోర్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.